ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి, మండలి చైర్మన్ గుత్తా, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బాలూనాయక్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం సిద్ధం

ఎల్‌ఎల్‌బీసీ టన్నెల్‌కు నెలనెలా నిధులు

- ప్రాధాన్యత ప్రాజెక్టుగా డిండి ఎత్తిపోతల పథకం
- ఉదయసముద్రంతో పాటు ఇతర ప్రాజెక్టులపై దృష్టి
- భూ సేకరణ, అటవీ శాఖ అనుమతులకు ప్రత్యేక కార్యాచరణ
- సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి
- త్వరలోనే జిల్లా సస్యశ్యామలం : మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ)/చందంపేట : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని సాగు నీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రాబోయే మూడేండ్లల్లోనే ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఎల్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులపై ప్రత్యేక సమీక్ష చేస్తూ నెలనెలా నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. 2027 సెప్టెంబర్ నాటికి సొరంగ మార్గాన్ని పూర్తి చేయాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు. నక్కలగండి, ఉదయ సముద్రం బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు విడుదల చేస్తామని చెప్పారు. శుక్రవారం ఎల్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో బట్టి విక్రమార్క, మండలి చైర్మన్ గుత్తా, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు పరిశీలించారు. టన్నెల్‌లో ప్రయాణించి పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం మన్నెవారిపల్లి క్యాంపులో సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్, ట్రాన్స్‌కో రాష్ట్ర ఉన్నతాధికారులతోపాటు ఉమ్మడి జిల్లాల అధికారులు హాజరయ్యారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వం వహిస్తూ ప్రాజెక్టుల వారీగా అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇప్పించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, ప్రాధాన్యతలను ఇరిగేషన్ సీఈ అజయ్‌కుమార్ వివరించారు. మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులను రెండు వైపులా వచ్చే ఏడాది ఆరంభం నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. నెలకు 400 మీటర్ల తవ్వకం చేస్తే సుమారు రూ.30 కోట్లు అవసరమవుతాయని ఆర్థిక శాఖ మంత్రి భట్టిని కోరగా, నెలానెలా నిధులను విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. వచ్చే మూడేండ్లలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. నక్కలగండి, పెండ్లిపాకల రిజర్వాయర్లల్లో పెండింగ్ పనులు, భూ సేకరణ సమస్య, అటవీ శాఖ అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. డిండి ఎత్తిపోతల పథకంపై సమీక్షిస్తూ ఎదుళ్ల నుంచే నీటిని తీసుకుంటామని, ప్రాధాన్యత ప్రాజెక్టు కింద డిండి ఎత్తిపోతలను పూర్తి చేస్తామని ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న ఉదయసముద్రం, పిలాయిపల్లి, ధర్మారెడ్డికాల్వ, బునాదిగాని కాల్వకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలో ఆమోదం తెలిపి పనులు చేపడుతామని వెల్లడించారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ ఏఎమ్మార్పీ నాలుగో మోటర్‌ను నాలుగు రోజుల్లో నడుపాలని సీఈని ఆదేశించారు. ప్రధాన కాల్వ లైనింగ్ పనుల కోసం రూ.442 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపాలని ఆర్థిక శాఖ మంత్రి భట్టిని కోరారు. ఉదయసముద్రం ఎత్తిపోతల పథకంలో భూ సేకరణతోపాటు పనుల నిర్వహణ కోసం రూ.300 కోట్లు కావాలని విజ్ఞప్తి చేశారు. సబ్ స్టేషన్లు, ఇతర విద్యుత్ అవసరాలకు సంబంధించి ఎమ్మెల్యేలు ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులు వెంటనే అనుమతులు ఇవ్వాలని భట్టి సూచించారు.

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ నక్కలగండి, సింగరాజుపల్లి రిజర్వాయర్లకు సెల్ఫ్ క్యాచ్‌మెంట్ ఏరియా ఉందని, పెండింగ్ పనులు పూర్తి చేసి నీళ్లు నిల్వ చేస్తే గ్రౌండ్ వాటర్ పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. టన్నెల్ పూర్తయ్యే నాటికి వాటి ద్వారా సాగునీరు అందించవచ్చన్నారు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్‌తో పాటు కాల్వ విస్తరణను 2400 క్యూసెక్కుల సామర్థ్యంతో చేపడితేనే టన్నెల్ వాటర్‌ను పూర్తి స్థాయిలో వాడుకోవచ్చన్నారు.

ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు వేము ల వీరేశం, బాలూనాయక్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, డాక్టర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ తమ నియోజకవర్గాల్లోని ప్రాజెక్టుల పనులపై వివరించారు. ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి, నిధుల కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. చందంపేట మండలంలోని నక్కలగండి తండాకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని ఎమ్మెల్యే బాలూనాయక్ కోరారు. నక్కలగండి ముంపు ప్రాంతాలకు ఇచ్చిన విధంగానే ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గంలో ముంపునకు గురవుతున్న మన్నెవారిపల్లి సమీప ప్రాంతాల్లో ఇండ్లకు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పెండ్లిపాకల రిజర్వాయర్ పరిధిలో ముంపునకు గురవుతున్న గుడితండా, హర్యాతండాకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలన్నారు. రివ్యూ మీటింగ్‌లో ఫైనాన్స్ విభాగం స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇరిగేషన్ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ అజయ్‌కుమార్, అంతకుముందు చీఫ్ ఇంజనీర్ వి. అజయ్ కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్, నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ మాదావత్ సంతోశ్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పాల్గొన్నారు.

నెల్లికల్లు లిఫ్ట్‌ను కుదించొద్దు : ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్సీ

సాగర్ నియోజకవర్గంలోని నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ సర్కార్ 20వేల ఎకరాల ఆయకట్టుతో డిజైన్ చేసిందని, ఇప్పుడు దాన్ని కుదించాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. 75 శాతానికి పైగా గిరిజన ప్రాంతం సాగర్‌కు చెంతలో ఉన్నా సాగునీటికి నోచలేదన్నారు. అందువల్ల గత డిజైన్ ప్రకారమే ఆయకట్టుకు నీరందేలా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటికీ అవసరమైన నిధులు విడుదల చేస్తూ నిర్దిష్ట కాలపరిమితితో పూర్తి చేయాలన్నారు.

ఎంజీయూలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

- తొలిరోజు 54 మంది హాజరు

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్లు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి

రామగిరి, సెప్టెంబర్ 20 : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేజ్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న 33 పీహెచ్‌డీ అడ్మిషన్లకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వర్సిటీ నిర్వహించిన పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో 93మంది అర్హత సాధించారు. తొలి రోజు 60మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలువగా 54మంది హాజరైనట్లు ఎంజీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి వెల్లడించారు. మిగిలిన అభ్యర్థులకు శనివారం ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, ఎంజీయూ ఎంబీఏ డీన్ సరిత, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, బీఓఎస్ మిర్యాల రమేశ్‌కుమార్, హెచ్‌ఓడీ మారం నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లలు ఈసారి సగమే..

నల్లగొండ జిల్లాలో 6 కోట్ల నుంచి 3 కోట్లకు తగ్గించిన ప్రభుత్వం

సూర్యాపేట జిల్లాలో 3.38కోట్ల నుంచి 1.70కోట్లకు..

బీఆర్‌ఎస్ పాలనలో ఏడేండ్లపాటు సవ్యంగా సరఫరా

మత్స్యకారులకు ఈసారి అరకొర ప్రయోజనమే..

నీలి విప్లవంలో భాగంగా ఏడేండ్ల పాటు కేసీఆర్ సర్కారు వంద శాతం సబ్సిడీతో పంపిణీ చేసిన చేప పిల్లల సంఖ్యను కాంగ్రెస్ ప్రభుత్వం సగానికి తగ్గించింది. నల్లగొండ జిల్లాకు సంబంధించి 2016-17 నుంచి 2022-23 వరకు ఏటా 6 కోట్ల చేప పిల్లలను సరఫరా చేయగా, ఈసారి 3 కోట్లకు మాత్రమే టెండర్లు స్వీకరించింది. ఈ నెల 19న ఈ ప్రక్రియ పూర్తవడంతో త్వరలోనే ఫైనల్ చేసి వచ్చే నెల నుండి చెరువుల్లో సీడ్ పోయనున్నది. చేప పిల్లల సంఖ్య సగానికి తగ్గడంతో ఈసారి చిన్న చెరువులను మినహాయించి పెద్ద చెరువులు, రిజర్వాయర్లలోనే వదిలే అవకాశం ఉంది.

– నల్లగొండ/సూర్యాపేట అర్బన్, సెప్టెంబర్ 20

మత్స్యకారులకు అరకొర ప్రయోజనమే..

జిల్లావ్యాప్తంగా 227 మత్స్య సహకార సొసైటీలు ఉండగా ఆయా సొసైటీల్లో 25 254 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 24 మహిళా సొసైటీలు ఉన్నాయి. ఈ సభ్యులు జిల్లాలోని 9 జలాశయాలు, 1,399 చెరువుల్లో చేపలు పట్టి వాటిని స్థానికంగా, ఇతర రాష్ర్టాలకు ఎగుమతి చేసి ఏటా రూ.400 కోట్ల వ్యాపారం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ సర్కారు ప్రోత్సాహంతో ఏడేండ్లుగా మత్స్యకారులు ఉపాధి మెరుగు పడింది. కొర్రమీను, బొచ్చ, రవ్వ, పాంప్లెంట్, జల్ల, బురక, చందమామ, ఆలుగ, బురద మట్ట వంటి చేపలను చేపలను పెంచి ఇక్కడి అవసరాలు తీరాక ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్నాటక రాష్ర్టాలకు ఎగుమతి చేసేవారు. ఈసారి సగం పిల్లలను వదిలే అవకాశం ఉండడంతో ఇతర రాష్ర్టాలకు ఎగుమతి కష్టం కానుంది. మత్స్యకారుల ఉపాధిపైనా తీవ్ర ప్రభావం పడనున్నది.

బీఆర్‌ఎస్ పాలనలో ఏడేండ్లుగా ఏటా ఆరు కోట్ల చేప పిల్లల విడుదల

2014కు ముందు జిల్లావాసులు చేపలు తినాలంటే పొరుగున ఉన్న ఆంధ్రా లేదా ఇతర రాష్ర్టాల నుంచి వచ్చే చేపలే దొరికేవి. 2016-17 నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో ఏటా రూ.5.50 కోట్లు వెచ్చించి నల్లగొండ జిల్లాలోని నీటి వనరుల్లో 6 కోట్ల చేప పిల్లలను వదులుతూ వచ్చింది. ఇందుకోసం ఏడేండ్లలో రూ.29.27 కోట్లు ఖర్చు చేసింది. ఏటా రిజర్వాయర్లల్లో రొయ్య పిల్లలను కూడా విడుదల చేసేది. తద్వారా మత్స్యకారులకు కూడా చేతినిండా పని దొరికింది.

నీలి విప్లవం కింద పలు చెరువుల నిర్మాణం..

నీలి విప్లవంలో భాగంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృత్రిమ చెరువుల నిర్మాణాలను కూడా ప్రోత్సహించింది. 2017-18 నుంచి 2020-21 వరకు ప్రభుత్వం 60శాతం సబ్సిడీతో మహిళా మత్స్యకారులతో పాటు ఎస్సీ, ఎస్టీలకు చెరువుల నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. జిల్లాలో 55 మంది మత్స్యకారులు చేపల చెరువులు నిర్మించుకునేందుకు రూ.3.32 కోట్ల సబ్సిడీ ఇచ్చింది. సీడ్ ఉత్పత్తికి సంబంధించిన చెరువుల నిర్మాణానికి 37 మందికి మరో 1.84 కోట్ల సబ్సిడీ అందజేసింది. చేప సీడ్ హచరీస్, రీసర్క్యులేటెడ్ ఆక్వా కల్చర్ పద్ధతి, పంజరంలో చేపలు పెంచడాని రూ.10కోట్లు సబ్సిడీ రూపంలో ఇచ్చింది. చేపలు అమ్మడానికి, చేపలు పట్టే సామగ్రికి, రవాణా వాహనాలకు 60 నుంచి 90శాతం సబ్సిడీతో ఏడేండ్లల్లో 7 వేల మందికి రూ.42కోట్ల సబ్సిడీని అందించింది.

సూర్యాపేట జిల్లాలో...

సూర్యాపేట జిల్లాలో 167 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలోని 648 చెరువుల్లో 3.38 కోట్ల ఉచిత చేప పిల్లలను వదిలి వారికి ఉపాధి కల్పించేవారు. తాజా ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇక్కడ 1.70 కోట్ల చేప పిల్లలను అందించనున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. సమైక్య పాలనలో సూర్యాపేట జిల్లా పరిధిలో 144 మత్స్య సహకార సంఘాలు మాత్రమే ఉండేవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హతను బట్టి 167 సంఘాలకు పెంచి, కొత్త సభ్యులకు అవకాశం కల్పించింది. తద్వారా 14 వేల మంది మత్స్యకారుల నుంచి 20 వేల మందికి ఉపాధి అవకాశాలు పెరిగాయి. వివిధ సంక్షేమ పథకాల ద్వారా వారికి ప్రయోజనం చేకూర్చింది. 4 వేల మందికిపైగా సబ్సిడీపై వాహనాలను సమకూర్చింది. సూర్యాపేట జిల్లాకు సంబంధించి చేప పిల్లల విడుదలకు గానూ నాలుగు టెండర్లు వచ్చినట్లు సమాచారం. 10 నుంచి 15 రోజుల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగులు నాయక్ తెలిపారు. మత్స్యకారులు మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోకుండా ప్రభుత్వం అందించే చేప పిల్లలను ఉచితంగా పొందవచ్చన్నారు.

గతేడాది పోసిన చేపపిల్లల్లో ఈసారి 50 శాతమే..

జిల్లాలోని నీటి వనరుల్లో గతేడాది పోసిన చేప పిల్లలసంఖ్యలో 50 శాతం మాత్రమే పోసేందుకు టెండర్లు పిలువాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు టెండర్లు తీసుకున్నాం. చిన్న చెరువుల్లో సీడ్ పోయాలా, వద్దా అనే దానిపై క్లారిటీ రాలేదు. ప్రభుత్వం ఆదేశానుసారం ఏయే చెరువుల్లో పోయమంటే వాటిల్లో వదలడం జరుగుతుంది.

-చరితారెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి, నల్లగొండ

కేసీఆర్ హయాంలోనే మంచిగా బతికినం

మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే మేము ఆర్థికంగా మంచిగా బతికినం. గతంలో మా చెరువులో వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలు వదిలిండ్రు. సొసైటీ సభ్యులం ఆ చేపలను పట్టుకొని అమ్మి సమాజంలో మెరుగ్గా జీవించినం. ఈకాంగ్రెస్ సర్కారోళ్లు కేవలం రిజర్వాయర్లలో మాత్రమే చేప పిల్లలను పోస్తామని చెబుతుండ్రు. చెరువుల్లో ఉచిత చేప పిల్లలను పోసే పరిస్థితి లేకుంటే మా బతుకులు కష్టంగా మారనున్నాయి.

-పిల్లి సైదులు, మత్స్య కార్మికుడు, దోమపల్లి, నల్లగొండ మండలం

ట్రిపుల్‌ఆర్‌పై దొంగచాటు సర్వే!

- స్టే ఉన్నా రాత్రిళ్లు సర్వే చేస్తున్నారంటున్న రైతులు
- కోర్టు ధిక్కరణ నోటీసులు పంపిస్తామని వెల్లడి

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ట్రిపుల్‌ఆర్‌పై రెవెన్యూ అధికారులు దొంగ చాటున సర్వే చేస్తున్నారా? రాయగిరితోపాటు పలు గ్రామా ల్లో హైకోర్టు స్టే ఉన్నా సర్వే చేస్తున్నారా? అంటే, అవుననే తెలుస్తున్నది. ట్రిపుల్ ఆర్‌లో భాగంగా రెవెన్యూ అధికారులు రాత్రిళ్లు సర్వే చేస్తున్నారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. రెండ్రోజులుగా సాయం త్రం పొలాల వద్ద వివరాలు సేకరిస్తున్నారని చెప్తున్నారు. గురువారం రాయగిరి పరిధిలో, శుక్రవారం గౌస్‌నగర్‌లో ఓ రెవెన్యూ అధికారి లెక్కలు తీసుకున్నారని స్థానిక రైతులు తెలిపారు. శుక్రవారం దీనిపై సదరు అధికారిని రైతు ప్రశ్నించగా, అక్కడి నుంచి ఉడాయించినట్టు పేర్కొన్నారు. ఇదే విషయంపై భువనగిరి తాసీల్దార్ అంజిరెడ్డిని నమస్తే తెలంగాణ వివరణ కోరగా.. పగటి పూటనే లెక్కలు తీస్తున్నామని, వ్యవసాయ, వ్యవసాయేతర భూము ల వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

కోర్టు స్టే ఉన్నా సర్వే!

ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులో ఉత్తర భాగంలో జిల్లా మీదుగా 59.33 కిలో మీటర్ల మేర రహదారులు నిర్మించనున్నారు. దీని పరిధిలోకి తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలు వస్తున్నాయి. మొత్తంగా సుమారు 2వేల ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందులో రాయగిరి రైతులు భూములు కోల్పోతున్నారు. గతంలోనూ ఈ ప్రాంత రైతులు పలు సందర్భాల్లో తమ భూములను కోల్పోవాల్సి వచ్చింది. ఈసారి తమ భూములు ఇచ్చేది లేదని పోరాటం చేస్తున్నారు. హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ప్రస్తుతం రాయగిరితో పాటు పలు గ్రామాల భూములపై స్టే ఉంది. అయినప్పటికీ అధికారులు సర్వే చేయడం ఏంటని రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుందని, తమ లాయర్‌ను సంప్రదించి నోటీసులు అందజేస్తామని రైతులు చెప్పుకొస్తున్నారు.

విదేశీ విద్యకు బీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు

నల్లగొండ, సెప్టెంబర్ 20 : 2024-25 విద్యా సంవత్సరానికిగానూ బీసీ, ఈబీసీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతీబా పూలే విదేశీ విద్యా నిధి పథకం కింద దరఖాస్తులు చేసుకోవాలని బీసీ సంక్షేమ అధికారి రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు అక్టోబర్15 వరకు www.telangana epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 35 సంవత్సరాలలోపు వయసు, రూ.5లక్షలలోపు వార్షిక ఆదాయం కలిగి ఉండాలని, ఇంజినీరింగ్, వైద్యం, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్ర డిగ్రీలో 60శాతం మార్కులు పొంది ఉండాలని తెలిపారు.

కొర్రీల సర్కారులో రుణమాఫీ కాదాయె

- జాబితాలో పేరున్నా రుణమాఫీకి నోచని రైతులు
- అసైన్డ్ భూములను చార్జ్ క్రియేషన్ అవడం లేదని నిరాకరిస్తున్న డీసీసీబీ
- బీఆర్‌ఎస్ సర్కారులో ఇవే భూములకూ రుణమాఫీ
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చెయ్యదని ప్రశ్నిస్తున్న రైతాంగం

నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మోత్కూర్ శాఖ

గుండాల, సెప్టెంబర్ 20 : రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ మాటలు నీటిమూటలే అయ్యాయి. ప్రభుత్వం కొర్రీల మీద కొర్రీలు పెడుతూ రైతులను రుణమాఫీకి దూరం చేస్తున్నది. అసైన్డ్ భూములకు సైతం బీఆర్‌ఎస్ సర్కారులో రుణమాఫీ వర్తించగా.. ఇప్పుడు మాత్రం డీసీసీబీ అధికారులు చార్జ్ క్రియేషన్ అవడం లేదంటూ రైతుల ఖాతాలో నగదు జమ చేయడం లేదు. గుండాల మండల పరిధిలో ప్రభుత్వం నుంచి గతంలో అసైన్డ్ భూమి పొందిన వందలాది రైతులకు రుణమాఫీ మంజూరైనా రుణమాఫీ అవడం లేదు. అసైన్డ్ భూమి ఉండి మోత్కూర్ డీసీసీబీ మోత్కూరు శాఖలో పంట రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ అయినా అయినట్టు ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో పేరు వచ్చినా, అసైన్డ్ భూములు ప్రొహిబిటెడ్ కాలమ్‌లో ఉన్నాయన్న సాకు చూపుతూ మాఫీ చేయడం లేదు. దాంతో బాధిత రైతులు మోత్కూరులోని డీసీసీబీ, గుండాల తాసీల్దార్ కార్యాలయం, పీఏసీఎస్ చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. బ్యాంకు అధికారులు మాత్రం చార్జ్ క్రియేషన్ కాకపోవడం రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవడం లేదని చెప్తున్నారు. చార్జ్ క్రియేషన్ కాకుండా రుణమాఫీ నగదు ఖాతాలో జమ చేసేందుకు వీలు ఉండదని, అలా చేస్తే సదరు రైతు అదే భూమిపై మరొక బ్యాంకులో రుణం తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. రైతుల అసైన్డ్ భూమి సర్వే నెంబర్లను ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ నుంచి తొలగిస్తేనే తమ కు చార్జ్ క్రియేషన్ అవుతుందని పేర్కొంటున్నారు. ఇది రెవెన్యూ శాఖ పరిధిలోని విషయమని, ఆ శాఖ అధికారులను కలవాలని సూచిస్తున్నారు. ఒక రైతుకు కొంత అసైన్డ్ భూమి ఉండి, మిగతా సొంత భూమి ఉన్నా రుణమాఫీ అవడం లేదు. కాగా, గతంలో ఇవే భూములపై బీఆర్‌ఎస్ సర్కారులో పంట రుణం మాఫీ అయ్యిందని, కాంగ్రెస్ ప్రభు త్వం ఎందుకు చేయదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

చార్జ్ క్రియేషన్ లేకుండా రుణమాఫీ చేయలేం

ప్రభుత్వ భూమి కలిగిన రైతుల పేర్లు రుణమాఫీ లిస్టులో వచ్చినప్పటికీ వారి పేరుపై చార్జ్ క్రియేషన్ అయితేనే రైతు ఖాతాలో జమ అవుతుంది. చార్జ్ క్రియేషన్ లేకుండా రుణం ఇస్తే ఆ రైతు మరొక బ్యాంకులో అదే భూమిపై రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. వారికి రుణమాఫీ వర్తించాలంటే ఆ భూములను ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ కాలమ్ నుంచి తొలగించాలి.

-అమరేందర్ రెడ్డి, డీసీసీబీ మేనేజర్, మోత్కూర్ బ్రాంచ్

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

అసైన్డ్ భూమి ఉండి రుణమాఫీ కాని రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టర్ ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణమాఫీ వర్తించేలా చూస్తాం.

-జల కుమారి, తాసీల్దార్, గుండాల

బీఆర్‌ఎస్ సర్కారులో మాఫీ అయ్యింది.. ఇప్పుడెందుకు కాదు?

నా పేరు మీద ఎకరం 20 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దాని మీద మోత్కూర్ డీసీసీబీలో పంట రుణం తీసుకున్నాను. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో నా పేరుంది. బ్యాంకు వెళ్లి పత్రాలన్నీ ఇచ్చాను. ఇప్పటికీ నా ఖాతాలో రుణమాఫీ జమ కాలేదు. బ్యాంకు అధికారులను రెవెన్యూ అధికారులను కలవండి అంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నాకు రుణమాఫీ అయ్యింది. ఇప్పుడెందుకు చేయడం లేదో అర్థమైతలేదు. బ్యాంకు చుట్టూ, రెవెన్యూ ఆఫీసర్ల చుట్టూ తిరిగి తిరిగి యాష్ట కొస్తున్నది.

-పందుల మల్లేశ్, రైతు, పాచిల్ల గ్రామం, గుండాల మండలం

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ రూరల్, సెప్టెంబర్ 20 : కులగణన జరిపిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, సంఘం గౌరవ సలహాదారుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, మునాస ప్రసన్న, అల్లివేణు, బక్కతట్ల వెంకన్న, కీర్తి శ్రీనివాస్, ముత్యాలు, అజయ్, సతీశ్, నాగరాజు, భరత్, సదాశివ , రమేశ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

దేవరకొండలో ర్యాలీ

చందంపేట(దేవరకొండ) : కుల గణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింపల్లి శ్రీనివాస్ గౌడ్, చొల్లేటి భాస్కరాచారి, రాజారావు, చంద్రమౌళి, రజిత, బ్రహ్మాచారి, శ్రీనివాసులు, వెంకట్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

గుంతలో రాళ్లు పూడ్చి.. బస్సును వంతెన దాటించి

- ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న లో లెవల్ వంతెన
- కొత్తది నిర్మించాలని స్థానికుల వేడుకోలు

లో లెవల్ వంతెనపై పడిన గుంతలో రాళ్లు పేరుస్తున్న బస్సు డ్రైవర్, ప్రయాణికుడు

తుంగతుర్తి, సెప్టెంబర్ 20 : ఇటీవల వర్షాలకు మండల కేంద్రంలోని తుంగతుర్తి-సూర్యాపేట ప్రధాన రహదారిపై వెలుగుపల్లి రోడ్డులో గల లోలెవల్ వంతెన దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుక్రవారం సూర్యాపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వంతెనపై ఏర్పడిన గుంతల్లో వెళ్లేందుకు ఇబ్బంది పడడంతో బస్సు డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు కలిసి గుంతలను రాళ్లతో పూడ్చి బస్సును వంతెన దాటించారు. ఈ లో లెవల్ వంతెన దెబ్బతిని నెలరోజులు కావస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే కొత్త వంతెన నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు.